తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
03 జూలై 2026



## వరదను వీక్షించండి.. కానీ ప్రమాదాన్ని ఆహ్వానించొద్దు

- అమరచింత ఎస్సై స్వాతి
- సెల్ఫీల కోసం ప్రాణాలను పణంగా పెట్టొద్దు.. పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించండి
- 32 గేట్లు ఎత్తివేతతో జూరాలకు భారీగా తరలివచ్చిన సందర్శకులు
- ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాలతో కట్టుదిట్టమైన ప్రత్యేక బందోబస్తు

**వనపర్తి బ్యూరో /జూరాల, ఆగస్టు 2 (జనంసాక్షి):**
జూరాల ప్రాజెక్టు 32 గేట్లను ఎత్తివేయడంతో భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. ఆదివారం సెలవు దినం కావడంతో వరద ప్రవాహాన్ని తిలకించేందుకు జూరాల ప్రాజెక్టుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.
ఈ నేపథ్యంలో ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఆదేశాల మేరకు అమరచింత ఎస్సై స్వాతి ఆధ్వర్యంలో జూరాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.
ప్రమాదకర ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, నీటి ప్రవాహానికి సమీపంలోకి వెళ్లకుండా పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించారు. సందర్శకులు సురక్షిత దూరం నుంచే వరద ప్రవాహాన్ని వీక్షించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు.



ఈ సందర్భంగా అమరచింత ఎస్సై స్వాతి మాట్లాడుతూ, వరదల సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేవలం వరదను చూడాలనే ఉద్దేశంతో ప్రమాదకర ప్రాంతాలకు వెళ్ల వద్దని, పోలీసు శాఖ జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.
వరద ప్రవాహాన్ని సమీపం నుంచి చూడాలనే ఉత్సాహంతో నీటి అంచులకు వెళ్లడం, సెల్ఫీలు లేదా వీడియోల కోసం ప్రాణాలను పణంగా పెట్టడం తీవ్ర ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.



పోలీసులు ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను దాటే ప్రయత్నం చేయవద్దని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.
చిన్నారులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారిని ఒంటరిగా నీటి ప్రాంతాల వైపు వెళ్లనివ్వవద్దని సూచించారు. సందర్శకులు సురక్షిత ప్రాంతాల నుంచే వరదను వీక్షించాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే సమీప పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని ఎస్సై స్వాతి తెలిపారు.

## జల సంరక్షణే మన భవిష్యత్తు

- జడ్చర్లలో క్యాచ్ ది రెయిన్ కార్యక్రమం
- మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్



**జడ్చర్ల, ఆగస్టు 2 (జనంసాక్షి):** పట్టణాల్లో కాంక్రీటు నిర్మాణాలు పెరగడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకక భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ నీటి ఎద్దడిని నివారించడానికి ప్రతి చుక్కను ఒడిసిపట్టడం అత్యవసరం.

**ఆర్టిఫిషియల్ రీచార్జింగ్ విధానం...**
వర్షపు నీటిని గుంతల్లో వదిలేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో బోర్లు, ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి పంపించడమే 'ఆర్టిఫిషియల్ రీచార్జింగ్'. పైకప్పు నీటిని పైపుల ద్వారా పాత బోర్లకు అనుసంధానించడం ద్వారా జలమట్టాలు పెరుగుతాయి.




**జడ్చర్లలో క్యాచ్ ది రెయిన్ కార్యక్రమం...**
జడ్చర్ల మున్సిపాలిటీలో వర్షపు నీటి సంరక్షణ కోసం క్యాచ్ ది రెయిన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ నివాసాలు, వాణిజ్య సముదాయాలలో రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేసుకుని, ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని భూమిలోకి మళ్లించాలి.

## సంగారెడ్డి నియోజకవర్గంలో పలు చోట్ల బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి





**సంగారెడ్డి, ఆగస్టు 02 (జనంసాక్షి):**
సంగారెడ్డి నియోజకవర్గంలో పలుచోట్ల జరిగిన ఆషాఢమాసం బోనాల ఉత్సవాల్లో ఆదివారం డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. సదాశివపేట మండలం ఆత్మకూరు గ్రామం లోని దుర్గమ్మ, పోచమ్మ బోనాల ఉత్సవాలకు హాజరైన ఆమె అమ్మ వార్లకు స్వయంగా బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బ్రహ్మ చారి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.
అనంతరం సదాశివ పేట పట్టణం లోని దుర్గమ్మ గుడి వద్ద జరిగిన బోనాల ఉత్సవం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఎంఅర్ఎఫ్ కార్మిక సంఘం నాయకుడు శేఖర్ తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.
సంగారెడ్డి పట్టణం లోని సంజీవ నగర్ కాలనీ లో పోచమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. గుడిని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మధు, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి రోడ్డుపైకి జిల్లా ఎస్పీ... ఆకస్మిక వాహన తనిఖీలు

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 2(జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ,ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు శనివారం అర్ధరాత్రి స్వయంగా రంగంలోకి దిగి ఆకస్మిక ర్యాండమ్ వెహికల్ చెకింగ్ నిర్వహించారు.
రాత్రి వేళల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, అనుమానాస్పద వ్యక్తులు,వాహనాల కదలికలపై నిఘా పెట్టడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు జమ్మిచేడు చౌరస్తా, పిల్లిగుండ్ల చౌరస్తా వద్ద ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు.జిల్లా ఎస్పీ స్వయంగా వాహన తనిఖీల్లో పాల్గొని పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీ ప్రక్రియను పర్యవేక్షించారు.
ఈ సందర్భంగా ఒక ఆర్ఐ, ఒక ఆర్ఎస్ఐతో పాటు 10 మంది పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందంగా విధులు నిర్వహించారు.
రాత్రి వేళల్లో అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా జరిగే వివిధ రకాల రవాణాను నియంత్రించడంతో పాటు,అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అనుమానాస్పద వాహనాల కదలికలను గుర్తిస్తూ ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నిబంధనలకు విరుద్ధంగా జరిగే రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యమని పోలీసులు తెలిపారు.ఈ తనిఖీల్లో భాగంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ తదితర వాహన సంబంధిత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉన్నాయా లేదా, వాహన పత్రాలు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలను పరిశీలిస్తూ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు.వాహన తనిఖీల సందర్భంగా నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తున్న ఒక కారును గుర్తించి గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. రాత్రి వేళల్లో కూడా పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, జిల్లాలో





నేరాలను అరికట్టేందుకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆకస్మిక తనిఖీలు, వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి వాహన సంబంధిత ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. అర్ధరాత్రి అయినా ప్రజల భద్రత విషయంలో రాజీ లేదనీ, జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీస్ శాఖ 24 గంటలు అప్రమత్తంగా ఉంటుందని ఈ ఆకస్మిక వాహన తనిఖీలు మరోసారి స్పష్టం చేశాయి.

# బీజేపీ జిల్లా మోర్చా అధ్యక్షులకు నియామక పత్రాల ప్రదానం

- పార్టీ అభివృద్ధికి నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేయాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపు



మెదక్ టౌన్, ఆగస్టు 2(జనంసాక్షి): మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు గౌరవనీయులు మాధవనేని రఘునందన్ రావు చేతుల మీదుగా మెదక్ జిల్లా వివిధ మోర్చాల నూతన అధ్యక్షులకు అధికారిక నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో ప్రజల్లో పనిచేస్తూ భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని నూతన మోర్చా అధ్యక్షులకు సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.
జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, మోర్చాల అధ్యక్షులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వడ్ల జనార్దన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు పట్లోల్ల మల్లిక, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రాములు నాయక్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు గ్యాన్ సింగ్, మెదక్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి జనగామ మల్లారెడ్డి, జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, పోతన్ చెట్టుపల్లి బీజేపీ సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్, మాజీ నర్సాపూర్ రూరల్ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, మెదక్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, జిల్లా సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘం బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి, ఆగస్టు 02 (జనంసాక్షి): ఆషాఢ మాసం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని పద్మశాలి సంఘం బోనాల పండుగ ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ బోనాల ఉత్సవాల విశిష్టతను కొనియాడారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో గుండు సత్యనారాయణ, బాబురావు, రాజు, జీవీ శ్రీనివాస్, విఠల్, చింత గోపాల్, చింత సాయినాథ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# అయిజ ఎస్ఐ గురుస్వామి దూకుడు.!

- వచ్చిరాగానే వరుస కేసుల మోత
- పేకాట, అక్రమ ఇసుక రవాణా, డ్రంక్ డ్రైవ్‌పై ఉక్కుపాదం
- ఎస్ఐ గురుస్వామిపై ప్రజల్లో ప్రశంసలు





అయిజ/రాజోలి, ఆగస్టు 2 (జనంసాక్షి): అయిజ పోలీస్ స్టేషన్‌కు ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పి. గురుస్వామి విధుల్లో చేరిన కొద్ది రోజుల వ్యవధిలోనే వరుస చర్యలతో నేరగాళ్లకు గట్టి హెచ్చరిక పంపుతున్నారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై రాజీ లేకుండా కేసులు నమోదు చేస్తూ కఠిన పోలీసింగ్‌తో తనదైన ముద్ర వేస్తున్నారు. విధుల్లో చేరిన వెంటనే ఎక్లాసుపురం గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం భూ వివాదం నేపథ్యంలో దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. తదుపరి భూపురం శివారులో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న ముఠాపై మెరుపు దాడి నిర్వహించి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5 మొబైల్ ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలు, రూ.21,700 నగదు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఇక తాజాగా పులికల్ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మేడికొండ గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని యజమానులపై కేసులు నమోదు చేశారు. అలాగే ఆదివారం రాత్రి అయిజ పట్టణంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. పోక్సో నిందితులు, పేకాట నిర్వాహకులు, మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడేవారు ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గురుస్వామి స్పష్టం చేశారు. ఎస్ఐ గురుస్వామి వరుస ఆపరేషన్లతో అయిజ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలకు పాల్పడే వారిలో భయాందోళనలు నెలకొనగా, ప్రజలు పోలీసుల దూకుడు చర్యలను స్వాగతిస్తూ అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

# సేవాలాల్ జగదాంబ ఆలయంలో చోరీ

- శంకర్ తాండలో ఘటన.... • ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు



శివ్వంపేట, ఆగస్ట్ 2(జనంసాక్షి): శివ్వంపేట మండలం భీమ్లా సక్రుతాండ గ్రామ పంచాయతీ పరిధిలోని శంకర్ తండాలో ఉన్న శ్రీ సేవాలాల్ జగదాంబ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. తాండవాసులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్ తండాలో ఇటీవల నిర్మించిన సేవాలాల్ ఆలయంలోకి దొంగలు ప్రవేశించి రెండు హుండీలను పగులగొట్టి అందులో ఉన్న నగదుతో పాటు అమ్మవారి కిరీటం, హారం, ముక్కు పుడకను చోరీ చేసి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఆలయంలోకి వచ్చిన దొంగలు సుమారు 30 తులాల వెండితో పాటు రూ.60 వేల వరకు నగదును అపహరించుకుపోయారని ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై రంగంలోకి దిగిన పోలీసులు స్థానికులను విచారించి, దొంగతనం గురించి ఆధారాలు సేకరిస్తున్నారు. శంకర్ తండాలో జగదాంబ సేవాలాల్ ఆలయంలో దొంగలు పడి నగదు, నగలు ఎత్తుకెళ్లిపోవడంతో స్థానికులలో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి.ఈ చోరీ ఘటన పై కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా గత ఐదారు రోజులుగా మండలంలో ఏదో ఒక గ్రామంలో వరుస దొంగతనాలతో ప్రజలు, ముఖ్యంగా వ్యవసాయ పనుల కోసం పొలాల వద్దకు వెళ్లే రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

# వనపర్తి జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా నియమితులైన మునిగళ్ల ప్రవీణ్ కుమార్



వనపర్తి, ఆగస్టు 2 (జనంసాక్షి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) మీడియా & కమ్యూనికేషన్స్ విభాగంలో వనపర్తి జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా నియమితులైన మునిగళ్ల ప్రవీణ్ కుమార్‌కు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మీడియా ద్వారా ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే అభినందనలు తనపై మరింత బాధ్యతను పెంచాయని పేర్కొన్న ప్రవీణ్ కుమార్, పార్టీ ఆశయాల సాధనకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు




మక్తల్, ఆగస్టు 02 (జనంసాక్షి):
మక్తల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని భారతి విద్యా నికేతన్ పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్నేహితుల దినోత్సవ విశిష్టత గురించి, ముఖ్యంగా స్నేహం గురించి విద్యార్థులకు వక్తలు వివరించారు. విలువైన స్నేహితులను సంపాదించుకోవడం చాలా ముఖ్యమని సూచించారు. దీంతోపాటు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను సైతం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తమ స్నేహితులకు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు అందించి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. సందర్భంగా పాటలు పాడిన విద్యార్థులు, ఉపన్యాసం అందించిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వాసవియన్ పోర్ స్టార్ కెసిఐఎఫ్ జిల్లా జాయింట్ ట్రెజరీ మనసాని నాగరాజు, మాజీ గవర్నర్ కల్వ శ్రీనివాస్ ,మాజీ ట్రెజరర్ దొంత లక్ష్మణ్, వాసవీ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొత్త ఆంజనేయులు, కోశాధికారి తాలంపల్లి పవన్ కుమార్, పాఠశాల కరస్పాండెంట్ కిరణ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు తాళంపల్లి అరవింద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ధన్వాడ, ఆగస్టు 2 (జనంసాక్షి):
ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు ధన్వాడ మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ధన్వాడ ఎమ్మార్వో కార్యాలయంలో నిర్వహించనున్నారు.
మార్కెట్ కమిటీ చైర్మన్ రాం పురం శివారెడ్డి, మండల నాయకుల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

# ఫలాంబరీ దేవిగా వనదుర్గమ్మ



పాపన్నపేట, ఆగస్టు 2 (జనంసాక్షి):
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. ఆషాడ మాసం మూడవ ఆదివారం సందర్భంగా అర్చకులు వేకువ జామున అమ్మవారిని వివిధ రకాల పండ్లతో ఫలాంబరీ రూపంలో అలంకరించారు. అభిషేకం,సహస్రనామార్చన,కుంకుమార్చన చేపట్టి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం కావడంతో రద్దీ కొనసాగింది .

## పొలం దున్నడానికి వెళ్లి రైతు మృతి



**చిన్నశంకరంపేట, ఆగస్టు 2 (జనంసాక్షి):** తన పొలము దున్నడానికి ట్రాక్టర్‌తో వెళ్లి రైతు చెరువు కట్ట కింద పోల్ వద్ద గాయంతో మృతి చెందినట్లు మృతుని భార్య మెట్టు కావ్య తెలిపింది. ఎస్సై కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గవలపల్లి పంచాయతీ అగ్రహారం గ్రామానికి చెందిన మెట్టు రాజు (28). ఆదివారం ఉదయం ఇంటి నుండి ట్రాక్టర్ పైన పొలము దున్నడానికి వెళ్లాడు. పది గంటల ప్రాంతంలో మా గ్రామానికి చెందిన మోగిరే సురేష్, రాజు ట్రాక్టర్ పై లేడు అని తెలపడంతో రాజు కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా చెరువు పక్కన గల హైటెక్ పక్కన ఎడమ చేతికి రక్త గాయాలతో పడి ఉందని తెలిపారు. భార్య మెట్టు కావ్య ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామ నిర్వహించి రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివానందం తెలిపారు.

## శ్రీ మహంకాళి మందిరంలో సామూహిక బోనాల ఉత్సవాలు

**సంగారెడ్డి, ఆగస్టు 02(జనంసాక్షి):** సదాశివపేట పట్టణంలోని చాపలకేరిలో శ్రీ మహంకాళి మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక బోనాల ఊరేగింపు ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దారి పొడవునా పోతురాజుల విన్యాసాలతో, జోగిని బోనంతో యువకుల డాన్సులతో అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ సందర్భంగా సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ, 11వ వార్డు కౌన్సిలర్ వైద్యం గోపి-ప్రియాంక పవన్, 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమతతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు.

ప్రతి సంవత్సరం ఆనవాయితీగా పులిమామిడి రాజు దంపతులు అమ్మవారికి బంగారు కళ్లతో పాటు బంగారు నుదుటి తిలకాన్ని ప్రత్యేకంగా తయారు చేయించి సమర్పించడం విశేషంగా నిలిచింది. భక్తి పారవశ్యంతో సమర్పించిన ఈ కానుకలు భక్తుల ప్రశంసలు అందుకున్నాయి.

ఎన్నో సంవత్సరాలుగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారని, భక్తితో కోరుకున్న కోరికలు నెరవేరుతున్నాయని పులి మామిడి రాజు తెలిపారు. ప్రతి సంవత్సరం ఆదివారం నిర్వహించే బోనాల ఊరేగింపు చాపలకేరి నుండి దుర్గాభవాని ఆలయం వరకు అత్యంత వైభవంగా సాగి, అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోందని పేర్కొన్నారు.

ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, కౌన్సిలర్లు పులిమామిడి మమత, వైద్యం గోపి



ప్రియాంక పవన్, శంకర్ గౌడ్, నర్సింలు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్, విద్యాసాగర్ రెడ్డి, కోవూరి విజయ్, షాజ్జి భాయ్, బిట్ల ప్రేమ్, లడ్డు వెంకన్నబాబు, శ్రీ మహంకాళి మందిరం అధ్యక్షుడు నల్ల సుధాకర్ , కార్యదర్శి శంకర్, కమిటీ సభ్యులు చాపల హన్మంతు, బంటు రవి, అఖిల్, క్రిష్ణ, ప్రవీణ్, నరేందర్, మనోహర్, ఆనంద్ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.

## కౌడిపల్లి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ

- **సర్పంచ్ చంద్రం కృష్ణగౌడ్, పర్యవేక్షణలో ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు**
- **ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**





**కౌడిపల్లి ఆగస్టు 02,(జనంసాక్షి):**

కౌడిపల్లిలో ఆదివారం పోచమ్మ, ఎల్లమ్మకు బోనాల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆషాడ మాసం అందులో మూడో ఆదివారం కావడంతో కౌడిపల్లి గ్రామస్తులంతా కలిసి భక్తిశ్రద్ధలతో గడపగడపకొ బోనం ప్రతిఏటా నిర్వహించే విధంగా ఈ సంవత్సరం మరింత ఘనంగా పోతరాజుల విన్యాసాలు, బ్యాండ్ మేళాలు, డీజే చెప్పుల నడుమ కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. ఆలయం వద్ద భారీ కటౌట్లు రంగురంగుల విద్యుత్ దీపక్రాంతులు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే అమ్మవారి ఆలయం వద్ద భక్తులతో రద్దీగా మారింది. గ్రామస్తులంతా బోనాలను గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించి పోచమ్మ ఎల్లమ్మ ఆలయానికి చేరుకొని బోనాలను సమర్పించారు. అనంతరం సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, మాట్లాడుతూ... గ్రామస్తులంతా కలిసి ప్రతి సంవత్సరం ఇలాగే గ్రామదేవతలకు బోనాల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. ట్రాఫిక్ అంతరాయం కాకుండా పోలీస్ సిబ్బందితో ఎస్ ఐ అమరేందర్, ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రముఖులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనగర్‌లో శోభాయమానంగా బోనాల ఉత్సవాలు



**సంగారెడ్డి, ఆగస్టు 02(జనంసాక్షి):** సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో గల ఆదర్శనగర్ కాలనీలో ఆదివారం శోభాయమానంగా అమ్మవారికి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కే. శంకర్ ఆధ్వర్యంలో కాలనీలో బోనాల పండుగ నిర్వహించడం ఇది 12వసారి ప్రతి సంవత్సరం ఆషాడ మాసం పురస్కరించుకొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మహిళలు బోనాలతో బయలుదేరి అమ్మవారికి సమర్పిస్తారు. బోనాల ఉత్సవాలలో కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు నర్సింగ్, చంద్రశేఖర్, రాజ్ కుమార్, తుకారం, ఆనంద్ వెంకటేశం, ఏవీ నర్సింలు, నరసింహ రాజు, మారుతి, ప్రశాంత్, మల్లారెడ్డి, అడివయ్యా, మహిళలు, ప్రసన్న వాణి, అంజలి, విశాల, వాణి, లక్ష్మి, రుక్మిణి, మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులే మా సంపాదన

- **రిటైర్డ్ ఉపాధ్యాయులు**




**జడ్చర్ల, ఆగస్టు 2 (జనంసాక్షి):** మేము పాఠాలు బోధించిన విద్యార్థులే మా సంపాదన అని రిటైర్డ్ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆదివారం జడ్చర్ల పట్టణంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో బాదేపల్లి బాలుర హైస్కూల్ పదవ తరగతి 1988 బ్యాచ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 38 ఏళ్ల తరువాత ఒకచోటకు చేరిన నాటి విద్యార్థులు, తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ నాడు తాము పాఠాలు బోధించిన విద్యార్థులు నేడు సమాజ సేవకులుగా మారడం అభినందనీయమన్నారు. 38 ఏళ్ల తర్వాత మమ్ముల్ని ఆహ్వానించడం మధుర అనుభూతిగా మిగిలి పోతుందన్నారు. ఇప్పటికీ ఆయా రంగాలలో విధులు నిర్వహిస్తూ సమాజ సేవలో ఉన్నందుకు విద్యార్థులను కొనియాడారు. హైస్కూల్ వందేళ్లు పూర్తయినందున శతాబ్ది ఉత్సవాల కోసం వేచి చూస్తున్నామని తెలిపారు. 38 ఏళ్లు అయినప్పటికీ 21 మంది గురువులు హాజరుకాగా, వారి ఆశీర్వాదం నేటికి అదృష్టంగా భావిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. స్నేహితుల దినోత్సవం కలిసి రావడం విశేషం. శతాబ్ది ఉత్సవాల నిర్వహణలో 1988 బ్యాచ్ విద్యార్థులమే కీలక పాత్ర పోషిస్తామని, త్వరలోనే ఉత్సవాలు నిర్వహించుకుందామని ప్రకటించారు. గడచిన ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆత్మశాంతి కోరుతూ మౌనం పాటించారు. ఉపాధ్యాయులను శాలువా, పూలమాల, మొమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వి.కృష్ణ, రాఘవేందర్, మురళి, సత్యం, ఎంపీడీఓ మంజులా దేవి, శతాబ్ది ఉత్సవ కమిటి అధ్యక్షుడు రవిశంకర్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణాచార్యులు, ఉపాధ్యాయులు, 120 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను, అస్వస్థతకు గురైన వారిని పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి







**వనపర్తి టౌన్, ఆగస్టు 2 (జనంసాక్షి):** మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదివారం వనపర్తి పట్టణం, మండలంలోని పలువురిని పరామర్శించి తన మానవీయతను చాటుకున్నారు.

మొదట వనపర్తి పట్టణం 22వ వార్డుకు చెందిన కరుణాకర్ సాగర్ సతీమణి వెంకటేశ్వరమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన మెడ ముని ఎల్లయ్య అకాల మరణం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి, వారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇరు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

అనంతరం వనపర్తి పట్టణం 22వ వార్డుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు తాజుద్దీన్ కాలు విరిగి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని 20వ వార్డు గాంధీనగర్‌కు చెందిన ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు ఉండేకోటి లక్ష్మయ్య ఇటీవల గుండె శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటుండగా, వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు, అస్వస్థతతో చికిత్స పొందుతున్న వారికి ధైర్యం చెబుతూ, త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని తిరిగి సాధారణ జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. అవసరమైన సమయంలో తాను అండగా ఉంటానని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమాల్లో నాయకులు వాకిటి శ్రీధర్, గంధం పరంజ్యోతి, నీలస్వామి, గులాం ఖాదర్, కౌన్సిలర్ సూగూరు మురళి సాగర్, దేవర్ల నరసింహ, సూర్యవంశం గిరి, సునీల్ వాల్మీకి, జోహార్ హుస్సేన్, అస్లాం ఖాన్, చిట్యాల రాము, తోట శ్రీను, బాలరాజు, విజయ్, తరుణ్, బన్నీ, సాయి, భాను, చైతన్య, కార్తీక్, శశాంక్, రసూల్, సల్మాన్, షకీల్, అతీక్, ఆసిఫ్, మోయిన్, ఖాజామైనుద్దీన్ (రిటైర్డ్ హెచ్‌ఎం) తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేద్దాం: కె.దయాకర్ రెడ్డి



**సంగారెడ్డి, ఆగస్టు 02 (జనంసాక్షి):** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 6న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ పోస్టర్‌ను ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.దయాకర్ రెడ్డి, కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సంకల్ప సభకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువత, బీసీ నాయకులు, సామాజికవేత్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, బీసీల హక్కుల పరిరక్షణ, తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ సభ చారిత్రాత్మకంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్ణాకర్ చంద్రిక ,నల్ల కృష్ణమోహన్, నవీన్, బి సుధాకర్, శశాంక్ ,సారా నితిన్, సాయికాంత్ గౌడ్, గోపాల్ రెడ్డి, మనోజ్ రెడ్డి పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అమ్మవారి దీవెనలు మన అందరిపై ఉండాలి

- ఎదుల్లాపూర్‌లో ఘనంగా బోనాల పండుగ



**శివ్వంపేట, ఆగస్ట్ 2 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ శివ్వంపేట మండల పరిధిలో ఎదుల్లాపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ కల్లూరి హన్మంత్ రావుల ఆధ్వర్యంలో గ్రామస్తులు, మహిళలు బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలకు పసుపు, కుంకుమ బొట్లతో, వేప మండలతో బోనాలకు అందంగా అలంకరించి, సాయంత్రం మహిళలు ఒక వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని బోనాలను ఎత్తుకొని, ర్యాలీగా పోతరాజుల విన్యాసాల మధ్యన ఊరేగింపుగా వెళ్లి నల్లా పోచమ్మ తల్లి దేవాలయంకు చేరుకొని అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. అనంతరం మాజీ ఎంపీపీ హరికృష్ణ, సర్పంచ్ హనుమంతరావు లు మాట్లాడుతూ అమ్మవారి దీవెనలతో సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో ఈ ప్రాంతం శోభితం కావాలని, పిల్లా పాపలు ప్రజలు అందరూ చల్లగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మ్యాకల యాదిరెడ్డి, వార్డు సభ్యులు గోష్కె సాయిలు, పుల్గం నవ్య, కల్లూరి సత్య కళ, బాలకుందు జనార్దన్, పైనం నర్సింలు, భూ రెడ్డి పద్మా, కల్లూరి సహదేవ్, మాజీ సర్పంచ్ లు కల్లూరి కీర్తన హన్మంత్ రావు, కల్లూరి వెంకటేష్, సునందా రెడ్డి, నాయకులు మర్రి మహేందర్ రెడ్డి, కల్లూరి సంతోష్ లతోపాటు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆషాడ బోనాలు

- అకట్టుకున్న అంజలి బోనం



**కొల్చారం ఆగస్టు 02(జనంసాక్షి):** తల్లి దుర్గమ్మ, పోచమ్మ మమ్మలి చల్లగా కాపాడాలంటూ బోనాల పండుగను మండల కేంద్రం కొల్చారంలో ఆదివారం వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆషాడ మాసం పురస్కరించుకొని అంజలి ప్రణవి లు తీసిన బోనం అందరిని ఆకట్టుకుంది. అంజలి గ్రామ చౌరస్తా వద్ద చేసిన నృత్యం యువతను ఉర్రుత లూగించింది. శివశక్తులు పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో బోనాలను ఊరేగింపుగా స్థానిక శివాలయం నుండి ప్రధాన విధుల గుండా గ్రామ చివరి లోని దుర్గమ్మ, పోచమ్మ ల ఆలయానికి వెళ్లి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆషాఢమాసంలో జరిగే బోనాల ఉత్సవాలు పూర్వకాలంలో వర్షాకాలం అరంభంలో వచ్చే కలరా, అతిసారం తదితర వ్యాధులు ప్రజల కుండా వేపాకు పసుపు కుంకుమలతో అమ్మవారిని పూజించే సంప్రదాయం ఉందని తెలిపారు. ఇలాంటి పండుగ గ్రామంలో జరపడంతో ప్రజలకు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే వాళ్లం అవుతామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవన్న గారి శేఖర్,మాజీ సర్పంచ్ రాజాగౌడ్,ఉప సర్పంచ్ కొరంపల్లి రాణి గోపి,కుమ్మరి నాగరాజు, సంఘమేశ్వర్, యాదగిరి, నాగేందర్, రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ చెన్నయ్య, వార్డు సభ్యులు వై కృష్ణ, సత్యనారాయణ, వెంకటేష్, దుర్గ ప్రసాద్‌గౌడ్, సంజీవరావు, సంతోష్, సత్యనారాయణ, ఆంజనేయులు, కిష్టయ్య, బూమయ్య, కిరణ్ గౌడ్, నాగరాజు, అనంత రాజ్, యువకులు,రఘు,భూమేష్, రాజేందర్ గౌడ్, సంతోష్,, సాకేత్, కార్తీక్, దీక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులుగా రెండవసారి బైండ్ల సత్యనారాయణ నియామకం



**మెదక్ టౌన్ ఆగష్టు 02(జనంసాక్షి):** జనతా పార్టీ (బీజేపీ)మెదక్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులుగా రెండవసారి బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం రోజు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాపై నమ్మకంతో రెండవసారి భాద్యతలు అప్పగించినందుకు పార్టీనీ మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళేందుకు నావంతుగా కృషిచేస్తామని ఆయన వెల్లడించారు. తన నియామకంనకు సహకరించిన కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వ లక్ష్మి నర్సయ్య,మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు రాధా మల్లేష్ గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బైండ్ల సత్యనారాయణ పేర్కొన్నారు.

# లో వోల్టేజ్ సమస్యకు చెక్.. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ చొరవతో మంజూరు**



**ఉప్పునుంతల, ఆగస్టు02 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ ముకరాల మోహన్ గౌడ్ విజ్ఞప్తి మేరకు అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాలతో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై, విద్యుత్ శాఖ అధికారులు బిగింపు పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముకరాల మోహన్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామంలో లో వోల్టేజ్ సమస్యతో ప్రజలు చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారమైందన్నారు. త్వరలో గ్రామంలోని నూతన కాలనీలకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, విద్యుత్ వైర్లు బిగించి కనెక్షన్లు కల్పించే పనులు కూడా చేపడతామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే డా. చిక్కుడ వంశీకృష్ణకు, సర్పంచ్ ముకరాల మోహన్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ సైదులు, లైన్‌మన్ సాయి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నేడు నర్సాపూర్‌లో కాంగ్రెస్ బీఎల్‌ఏల కీలక సమావేశం

- ఎస్ఐఆర్ ఓటరు సవరణపై సమీక్ష..
- భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం



**నర్సాపూర్, ఆగస్టు 2(జనంసాక్షి):** నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఎల్‌ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు), బీఎల్‌ఏ సూపర్వైజర్ల ముఖ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నర్సాపూర్‌లోని సాయి కృష్ణ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బీఎల్‌ఏ సూపర్వైజర్లు, బీఎల్‌ఏలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ప్రతి బీఎల్‌ఏ సూపర్వైజర్ తమ పరిధిలోని అన్ని బీఎల్‌ఏలను సమావేశానికి తీసుకువచ్చి విజయవంతం చేయాలని సూచించారు. గత నెల రోజులుగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియపై సమావేశంలో సమీక్ష నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన కీలక సూచనలు, మార్గదర్శకాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మెదక్ పార్లమెంట్ కోఆర్డినేటర్, తెలంగాణ సాంస్కృతిక సారథి వెన్నెల గద్దర్, నర్సాపూర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ అన్వేష్ రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ హాజరుకానున్నారు. అలాగే అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, గ్రామ సర్పంచులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆవుల రాజిరెడ్డి పిలుపునిచ్చారు.

# కోడుగల్ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**జడ్చర్ల, ఆగస్టు 2 (జనంసాక్షి):** మండల పరిధిలోని కోడుగల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. చాలాకాలం తర్వాత స్నేహితులంతా ఒక్కచోట చేరి నాటి పాఠశాల జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వేడుకలో తమకు విద్య నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. గురువులు విద్యార్థులను ఆశీర్వదించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్య క్రమాలు నిర్వహించుకోవడంతో పాటు, పాఠశాల అభివృద్ధికి సహకరించాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్‌తో రూ.1.30 లక్షల విలువైన బర్రె



**చెన్నూరు, ఆగస్టు 2 (జనంసాక్షి):** చెన్నూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘటనలో ఓ రైతుకు చెందిన అధిక విలువైన బర్రె మృతి చెందడంతో గ్రామంలో కలకలం రేగింది. గ్రామానికి చెందిన వందల పెద్ద నాగన్నకు చెందిన బార్ల షెడ్డులో సుమారు రూ. 1.30 లక్షల విలువ చేసే బర్రె మృతి చెందగా, మరో రెండు బర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. దీంతో రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. నాగన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున సుమారు 3:30 గంటల సమయంలో బార్ల షెడ్డులో నుంచి బర్రెలు గట్టిగా అరుస్తున్న శబ్దం వినిపించింది. షెడ్డుకు ఆనుకుని ఉన్న గదిలో నిద్రిస్తున్న ఆయన వెంటనే బయటకు వచ్చి చూడగా రెండు బర్రెలు కాలు కొడుతూ బాధపడుతున్నట్లు కనిపించాయి. పరిస్థితిని గమనించిన నాగన్న వెంటనే విద్యుత్ మెయిన్ స్విచ్‌ను ఆఫ్ చేసి షెడ్డులో ఉన్న బర్రెలన్నింటినీ బయటకు వదిలారు. అయితే అప్పటికే ఒక బర్రె మృతి చెందినట్లు గుర్తించారు. కరెంట్ షాక్ కారణంగానే బర్రె మృతి చెంది ఉండవచ్చని నాగన్న అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ లైన్‌మన్ ఘటనాస్థలికి చేరుకుని విద్యుత్ లైన్లు, కనెక్షన్లను పరిశీలించి వెళ్లినట్లు ఆయన తెలిపారు. బర్రె మృతి చెందడానికి గల అసలు కారణం అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. రూ. 1.30 లక్షల విలువైన బర్రె మృతి చెందడంతో తమ కుటుంబానికి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని నాగన్న ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బర్రె మృతికి గల కారణాలను వెల్లడించడంతో పాటు ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్





**సదాశివపేట ఆగస్టు2 (జనంసాక్షి):** సదాశివపేట పట్టణంలోని గొల్లకేరి పద్మశాలి సంఘం, గొల్లకేరి కురుమ సంఘం, చాపలకేరి మహంకాళి మందిరం, హట్కర్ పేట పద్మశాలి సంఘం, రాఘవేంద్రనగర్ కాలనీలో జిటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలతో భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొన్నారు. శివసత్తులు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఇటువంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రజలందరిపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్,నాయకులు చింతా సాయినాథ్, నాని,చిక్కుల మల్లేశం,అశోక్ గౌడ్,మున్సిపల్ కౌన్సిలర్ లు,ఆయా కూల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు పార్టీకి బిగ్ షాక్..


- కాంగ్రెస్‌లో చేరిన శ్రీరంగాపురం ఉపసర్పంచ్, వార్డు సభ్యులు
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న ప్రజాప్రతినిధులు



**శ్రీరంగాపూర్, ఆగస్టు 2 (జనంసాక్షి):** శ్రీరంగాపురం మండలంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణు ముదిరాజ్ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం ఉపసర్పంచ్ కళ్యాణకారి కాజా, వార్డు సభ్యులు చిట్టెమ్మ కురుమయ్య, శేఖర్, సుధా, రవి సాగర్‌లకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని, అందరూ ఐక్యంగా పనిచేసి పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్ర యాదవ్, గోవింద్, బహుజన రమేష్, రాజ్యలక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు

# 1510 మంది విద్యార్థులకు పట్టాలు..

- బీవీఆర్ఐటీలో ఘనంగా 26వ స్నాతకోత్సవం
- ప్రతిభావంతులకు స్వర్ణ పతకాలు, విశిష్ట అవార్డులు
- విద్యార్థులకు జీవితాంతం నేర్చుకునే తత్వం అవసరం
- డా. ఎ. జయలక్ష్మి



**నర్సాపూర్, ఆగస్టు (జనంసాక్షి):** నర్సాపూర్‌లోని బి.వి.రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో ఆదివారం 26వ స్నాతకోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూజీ, పీజీ కోర్సులకు చెందిన మొత్తం 1,510 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన టాపర్ విద్యార్థులకు స్వర్ణ పతకాలు, విశిష్ట అవార్డులు అందజేశారు.ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డా. ఎ. జయలక్ష్మి మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో నిరంతరం మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవరచుకోవాలని పట్టభద్రులకు సూచించారు.

గ్రాడ్యుయేషన్ అనేది ఎన్నో సంవత్సరాల కృషి, అంకితభావానికి దక్కిన గుర్తింపని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడుతూ వారికి అభినందనలు తెలిపారు.శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షులు శ్రీ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ, వృత్తి జీవితంలో విజయాన్ని సాధించాలంటే సామర్థ్యం, పరిస్థితులకు అనుగుణంగా మారగల నైపుణ్యం, విభిన్న రంగాల పరిజ్ఞానాన్ని సమన్వయం చేసుకునే దృక్పథం అవసరమన్నారు. విద్యార్థి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంలో బీవీఆర్ఐటీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే మాట్లాడుతూ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, పరిశోధనలు, ఆవిష్కరణల రంగాల్లో విద్యార్థులు విశేష విజయాలు సాధించారని తెలిపారు. అనంతరం స్నాతకోత్సవాన్ని ప్రారంభించి పట్టభద్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు విలువలతో కూడిన జీవితాన్ని గడుపుతూ తమ విజ్ఞానాన్ని, నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా పద్మభూషణ్ డా. బి.వి. రాజు మెమోరియల్ అవార్డు–2026ను బయోమెడికల్ ఇంజినీరింగ్ విద్యార్థి గడ్డం సాయి లిఖిత్ కుమార్ రెడ్డి అందుకోగా, బెస్ట్ అవుట్ గోయింగ్ అకడమిక్ అవార్డు–2026ను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విద్యార్థిని కుమారి గోపిశెట్టి సౌమ్య అందుకున్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ముఖ్య అతిథులు స్వర్ణ పతకాలు, అవార్డులతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల డీన్లు, విభాగాధిపతులు, ప్లేస్‌మెంట్ అధికారి డా. జె. బంగార్రాజు, పరీక్షల చీఫ్ కంట్రోలర్ డా. కాపుల ప్రభాకరరావు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, పట్టభద్రులు,

వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయ అకడమిక్ వస్త్రధారణలో హాజరైన పట్టభద్రులు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# పిల్లుట్లను ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దుతాం

- మండల నాయకులు బొమ్మిరాల శంకర్



**శివ్వంపేట, ఆగస్ట్ 2(జనంసాక్షి):** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆశీర్వాదం, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి సహకారంతో జిల్లాలోనే పిల్లుట్ల గ్రామాన్ని ఆదర్శవంత గ్రామంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీ అధ్యక్షులు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు బొమ్మిరాల శంకర్, సర్పంచ్ బుర్ర మురళీ గౌడ్, ఉప సర్పంచ్ స్వామి యాదవ్ లు పేర్కొన్నారు. ఉపాధిహామీ నిధులతో ఆర్ అండ్ బీ రోడ్డు నుండి ఎస్సీ కాలనీ మీదుగా జడ్పీ ఉన్నత పాఠశాలలోని పెద్దమ్మ దేవాలయం వరకు సీసీ రోడ్డు పనులను పిల్లి మధు, దినేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డిలు ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మురళీ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్లను నిర్మిస్తామని ఆయన అన్నారు. గ్రామస్తుల సహకారంతో ఎల్లవేళలా గ్రామాభివృద్ధికి నిత్యం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు ఈరన్ రాజు, దాసరి బుచ్చి బాలేష, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి పెద్దపులి సతీష్,దాసరి కృష్ణ,మస్కురి కన్నయ్య దాసరి భూమయ్య, ముంద్రాతి రమేష్, బుర్ర వినయ్, పిల్లి ప్రవీణ్ గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

# రాయికోడులో ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల మహోత్సవం





**రాయికోడు, ఆగస్టు 2 (జనంసాక్షి):** మండల కేంద్రమైన రాయికోడ్ శివారులో వెలసిన శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మతల్లికి ఆషాఢమాసంను పురస్కరించుకుని ఆదివారం బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి అభిషేకం చేసి,ప్రత్యేక పూజాకార్యక్రమాలు గావించి, ఘటంను సమర్పించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి శ్రీరేణుక ఎల్లమ్మతల్లికి ఒడి బియ్యం పోసి నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు,తదనంతరం డోలు వాయిద్యాలు డప్పుచప్పుళ్ల నడుమ శివసత్తుల పునకలు,పిల్లలు,పెద్దలు,యువకుల నృత్యాల నడుమ పురవీధులగుండా ఊరేగింపుగా వచ్చి మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ సన్నిధిలో అన్నప్రసాదా వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాజీపూర్ గ్రామంలో సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం



**మద్దూరు, ఆగస్టు 2 (జనంసాక్షి):** మద్దూర్ మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో సి.ఆర్.ఆర్.ఎస్.సి (సబ్ ప్లాన్) నిధుల ద్వారా మంజూరైన రూ.15 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు మరియు అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

ఈ పనులు పూర్తయిన అనంతరం గ్రామంలో మురుగు నీటి పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు, రహదారి సౌకర్యం మెరుగుపడి గ్రామ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఖాజీపూర్ గ్రామ అభివృద్ధి కి సహకరించిన మద్దూర్ ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుళ్ళ నర్సిములుకి, ఖాజీపూర్ గ్రామ సర్పంచ్ మరియు గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఖాజీపూర్ గ్రామ సర్పంచ్ ఎం.సాయప్ప, ఉప సర్పంచ్ భీమమ్మ, వార్డు సభ్యులు శాంత్ కుమార్,గోవిందు మరియు నర్సిములు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సి.చంద్రప్ప,మరియు సి. శ్రీనివాస్, జీ. రఘు, కృష్ణ, లాలప్ప కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు, కాంట్రాక్టర్ లవ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## తారకరామనగర్‌లో ఘనంగా 12వ బోనాల వార్షికోత్సవం



మెదక్ టౌన్, ఆగష్టు 02, (జనంసాక్షి): తారకరామనగర్ కాలనీలోని నల్ల పోచమ్మ దేవాలయంలో 12వ బోనాల వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై మోసుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు, బోనాల ఊరేగింపు, మొక్కుల చెల్లింపు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి కృపతో కాలనీ ప్రజలు సుఖసంతోషాలు, సుభిక్షంగా ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ధర్మకారి స్వరూప, మాజీ కౌన్సిలర్ తిమ్మన్నగారి అనిల్ కుమార్, భోజరాజు సాయికృష్ణ మూర్తి, చంద్రయ్య, దుబ్బ రాజయ్య, సీతారాములు, గంగాధర్, నరేందర్, మహిందర్, విష్ణు వర్ధన్, తరుణ్, శ్రీకాంత్, హరికుమార్, రాజేందర్, నవీన్, కరుణాకర్, కేశవ్, డాక్టర్ ప్రభాకర్ తదితరులతో పాటు కాలనీవాసులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముప్పిరెడ్డిపల్లిలో బోనాల ఉత్సవాలు



తూప్రాన్, ఆగస్టు 2(జనంసాక్షి): ఆషాడ మాసంలో తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు జరుపుకునే బోనాల ఉత్సవాలు ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామంలోని ప్రజలందరూ గ్రామ దేవతలకు బోనం సమర్పించి అమ్మవార్లను మొక్కులు తీర్చుకున్నారు. డప్పుచప్పుల్ల మధ్య పోతారాజుల నృత్యాల తో గ్రామంలో కొలాహలం నెలకొంది. మహిళల బోనాల ఊరేగింపు లో శివసత్తుల శిగాలు భక్తులను ఆకట్టుకున్నాయి. బోనాల సంద ర్భంగా గ్రామంలోని దేవాలయాలలో పంచాయతి పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ ఉత్సవాలలో సర్పంచ్ రాజానర్సింహా, మాజీ ప్రజా ప్రతినిధులు పెంటయ్య, శేఖర్ రెడ్డి, సంజీవ్, ఎల్లక్షన్ రెడ్డి, ఉప సర్పంచ్ రామ్‌రెడ్డి వార్డు సభ్యులు, నాయకులు పాల్గొని అమ్మ వార్లకు మొక్కులు చెల్లించుకున్నారు.

## ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు డి.. ఇద్దరికీ తీవ్ర గాయాలు..

పెద్ద శంకరంపేట, ఆగస్టు 2 (జనంసాక్షి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు డి కొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని గురు పాద గుట్ట వద్ద ఆదివారం చోటుచేసుకుంది.. పెద్ద శంకరంపేటకు చెందిన లొద్ద రవి, మల్కాపూర్ తాండకు చెందిన జైపాల్‌లు ఎదు రెదురుగా వస్తుండడంతో రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.. స్థానిక వెంటనే 108 సమాచారం అందించ డంతో ఇద్దరిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

## మహమ్మదాపూర్‌లో పసక పండుగ



రాయికోడు, ఆగస్టు 2, (జనంసాక్షి): మండల పరిధిలోని మహమ్మదాపూర్ గ్రామంలోని కురుమ సంఘం ఆధ్వర్యంలో గొల్ల కురుమలు ఆదివారం పసక పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి తమ ఆరాధ దైవమైన బీరప్ప స్వామి దేవాలయంలో కురుమలు జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. తధానంతరం సహపంక్తి భోజ నాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలతో పాటు కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బుజరంపేట్‌లో ఆషాడ బోనాల ఉత్సవాలు వైభవంగా

- పోచమ్మ, ముత్యాలమ్మ దేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ
- భారీగా తరలివచ్చిన భక్తజనం





కౌడిపల్లి, ఆగస్టు 02,(జనంసాక్షి): మెదక్ జిల్లా కౌడి పల్లి మండలంలోని బుజరంపేట్ గ్రామంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని గ్రామ దేవతలైన శ్రీపోచ మ్మ శ్రీముత్యాలమ్మకి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ మంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకోగా, చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, కుంకుమార్చ నలు నిర్వహించారు. అనంతరం మహిళలు సంప్ర దాయ దుస్తుల్లో అలంకరించిన బోనాలను తలపై మోసుకుంటూ భక్తి పారవశ్యంతో గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. డప్పు వాయిద్యాలు, భక్తి గీతాలు, జైజై ధ్వానాల మధ్యసాగిన ఈ ఊరేగింపు గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలి చే బోనాల పండుగను గ్రామ ప్రజలు ఎంతో ఘనం గా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి కుటుంబం ఉత్సవాల్లో భాగస్వామ్యం కావడంతో గ్రామమంతా భక్తిమయ వాతావరణంతో కళకళలాడింది. అమ్మ వారి కటాక్షంతో గ్రామంలో సుఖశాంతులు నెలకొనా లని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులకు పంట లు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యా లతో సుఖసంతోషాలతో జీవించాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పట్లోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ... గ్రామ ప్రజల సహకారంతో ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిం చడం ఆనందంగా ఉందని తెలిపారు. గ్రామ ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణకు ఈ వేడుకలు నిదర్శన మని పేర్కొన్నారు.

ఉప సర్పంచ్ కౌడిపల్లి గోపాల్ మాట్లాడుతూ, గ్రామ దేవతల ఆశీస్సులతో గ్రామం అన్ని రంగాల్లో అభి వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు ఐకమత్యంతో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకోటి లింగం, యాదగిరి, శ్రీకాంత్, శ్రీశైలం, మైపాల్, శేఖర్,మల్లేశం, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీకాంత్ మహిళలు, యువకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, భక్తులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు నిర్వాహ కులు తాగునీరు, ప్రసాదం తదితర ఏర్పాట్లు చేశారు. బుజరంపేట్ గ్రామంలో ప్రతి ఏడాది నిర్వహించే ఆషాడ బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ, గ్రామ ప్రజల భక్తి విశ్వాసాలను చాటుతున్నాయని పేర్కొన్నారు.

## విశ్వశాంతి మహాయాగ వేడుకలలో పాల్గొన్న సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



వెల్దండ, ఆగస్టు 02 (జనం సాక్షి): కల్వకుర్తి పట్టణ కేంద్రం లోని బిఎస్ఎన్ఎల్ గ్రౌండ్ లో శ్రీకృష్ణ కాలచక్రం శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నలోక కళ్యాణార్థం కోసం 91వ విశ్వ శాంతి మహాయాగంలో ఆది వారం వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ దంపతులు యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా యాగశాలలో పండితులు వేద మంత్రో చ్ఛరణంతో పుణ్య దంపతులకు పూర్ణ కుంభ స్వాగతం పలికి, స్వామీజీ ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ప్రజలందరూ సుఖ శాంతులు సమృద్ధి వర్షాభివృద్ధి, దేశ సంక్షేమం కోసం నిర్వహిస్తున్న మహాయాగంలో ప్రత్యేక పూజలు, ఆశీర్వాదాలు పొందారు.

## ఘనంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ జన్మదిన వేడుకలు

- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మార్కెట్ చైర్మన్ మనీలా సంజీవ్



వెల్దండ, ఆగస్ట్ 02 (జనంసాక్షి): కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ జన్మదిన వేడుకలు మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ ఆదివారం మండల కేంద్రంలో ఆయనను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి, స్వీట్లు తినిపించి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ నేతకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు దక్కాలని, ప్రజాసేవలో నిరంతరం కృషి చేయాలని, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని సంజీవ్ కుమార్ యాదవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకులు, అల్లం తోట బావి తండా సర్పంచ్ రోజా అరుణ్ నాయక్, వార్డు సభ్యులు జక్కుల మల్లేష్ యాదవ్, రవీందర్ నాయక్,పార్టీ కార్యకర్తలు,మండల ప్రజా ప్రతినిధులు, యువ నాయకులు పాల్గొన్నారు.

## స్నేహితుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు

- వనపర్తి జిల్లా సాహితి కళావేదిక అధ్యక్షుడు పలుసా శంకర్ గౌడ్




శ్రీరంగాపూర్ ఆగస్టు 2 (జనంసాక్షి): స్నేహితుల దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లా సాహితి కళావేదిక అధ్యక్షుడు పలుసా శంకర్ గౌడ్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "స్నేహం అనేది రక్త సంబంధం కంటే గొప్పది. కష్టంలో చేయూతనిచ్చి, సంతోషంలో పాలుపంచుకునే నిజమైన స్నేహమే జీవితానికి అందం. ఈ రోజుల్లో సోషల్ మీడియా వచ్చినా, మనసున్న స్నేహితుల విలువ తగ్గలేదు" అని అన్నారు. వనపర్తి కళావేదిక ద్వారా కళాకారుల మధ్య స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కళ ద్వారా సమాజంలో స్నేహం, సౌభ్రాతృత్వం పెంపొందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాహితి కళావేదిక సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడు బుక్క రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నాగర్‌కర్నూల్, ఆగస్టు 2 (జనంసాక్షి): బిజినాపల్లి మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు బుక్కరాజు ఇటీవల మృతిచెందగా, ఆ కుటుంబాన్ని జిల్లా వికలాంగుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు నారదాసు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి ముల్గర పరుశరాములు పరామర్శించి, సంఘం తరఫున 5వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ఇంటి వద్ద అందజేశారు.

వికలాంగుల పరిరక్షణ సమితి వికలాంగుల సంఘంలో సభ్యత్వం ఉన్న వికలాంగులు ఆపదల ఉన్న ప్రతి ఒక్కరికి సంఘం ఆర్థికంగా అండగా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిజినాపల్లి మండల అధ్యక్షుడు ఎద్దుల వెంకటస్వామి, బింగి నరేష్, శ్రీదేవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయత్
# ఆధ్వర్యంలో ఘనంగా భోనాల ఉత్సవాలు



**రేగోడ్, ఆగస్ట్02 (జనంసాక్షి):** మండల కేంద్రమైన రేగోడ్‌లో ఆదివారం పోచమ్మ,దుర్గమ్మ అమ్మవారికి వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో భోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో బాగంగా మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారికి భోనాలు సమర్పించగా, ప్రత్యేక పూజలు, మంగళహారతులు నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గ్రామంలోని భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తిలో,
# సామజిక రంగాల్లో ప్రత్యేక స్థానం బట్టి రామ్మోహన్

**మెదక్ రూరల్, ఆగష్టు 2 (జనంసాక్షి):**
ఉపాధ్యాయ వృత్తితో పాటు రాజకీయ, సామాజిక రంగాల్లో విశిష్ట సేవలందిస్తూ బట్టి రామ్మోహన్ సమాజంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ అన్నారు. ఆదివారం మెదక్ మండలం మాచవరం గ్రామంలో నిర్వహించిన ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆయన మాట్లాడారు. రామ్మోహన్ ఉపాధ్యాయుడిగా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడంతో పాటు పాఠశాలల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషిచేశారని కొనియాడారు. అనంతరం రామ్మోహన్ దంపతులను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



# ఫ్రెండ్షిప్ డే జరుపుకున్న ఎస్ఎస్సీ బాల్యమిత్రులు

**తెలకపల్లి, ఆగస్టు 02, (జనంసాక్షి):** అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలకపల్లి మండల కేంద్రంలో ఎస్ఎస్సీ బాల్య మిత్రులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకుని ఫ్రెండ్షిప్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలిసిన మిత్రులు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పాఠశాల రోజుల్లో జరిగిన మధుర సంఘటనలు, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధం, కలిసి గడిపిన మరపురాని క్షణాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మాకం భాస్కర్, బి. రాముడు, బి. రమేష్, నరేష్, రాం ప్రసాద్, ఎండీ మహమ్మద్, రాధాకృష్ణ, బి. లక్ష్మణ్ తదితర బాల్యమిత్రులు పాల్గొన్నారు.



# ఘనంగా గోరింటాకు పండుగ

**మక్తల్, ఆగస్టు 02 (జనంసాక్షి):**
మక్తల్ పట్టణంలో భవాసర్ సమాజ్ మహిళా కమిటీ ఆధ్వర్యంలో గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. శ్రీ భవాని మాత నల్లజానమ్మ దేవాలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే సంప్రదాయంలో భాగంగా ఈ వేడుకను నిర్వహించినట్లు మహిళా కమిటీ అధ్యక్షురాలు మహేంద్రకార్ విజయలక్ష్మి తెలిపారు. ఆషాఢ మాసంలో నిర్వహించే గోరింటాకు పండుగకు ప్రత్యేక విశిష్టత ఉందని ఆమె పేర్కొన్నారు. గోరింటాకు శుభం, మంగళానికి ప్రతీకగా భావిస్తారని, అమ్మవారి ఆశీస్సులతో కుటుంబాల్లో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని మహిళలు ఆకాంక్షిస్తారని తెలిపారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో గోరింటాకు పెట్టుకుని ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు నౌలే రంజన, ఉపాధ్యక్షురాలు నీమ్కర్ మాధురి, కార్యదర్శి నౌలే అనసూయ, కోశాధికారి బోడికే సరితతో పాటు పట్కే లక్ష్మీబాయి, రంగ్ధల్ గాయత్రి, మహేంద్రకార్ గాయత్రి, అనిత, కృష్ణవేణి, శోభ, సంధ్య, లక్ష్మీప్రియ, నవ్య, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



## నిజాయితీతో చేసిన సేవలకు
# సమాజం ఎప్పటికీ గౌరవం ఇస్తుంది: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 2 (జనంసాక్షి):** ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందితే వారి సేవలను సమాజం ఎప్పటికీ గౌరవిస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన నేనావత్ కబీర్దాసు సన్మాన కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పదవీ విరమణ పొందిన నేనావత్ కబీర్దాసును, ఆయన సతీమణిని శాలువాలతో ఘనంగా సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ సహజమైన ప్రక్రియేనని పేర్కొన్నారు. అయితే ఉద్యోగ జీవితంలో ప్రజల విశ్వాసాన్ని సంపాదించడం, పారదర్శకంగా, అంకితభావంతో విధులు నిర్వహించడం నిజమైన విజయమని అన్నారు. ప్రభుత్వ సేవలో సంపాదించిన అనుభవం, పరిజ్ఞానం, సామాజిక బాధ్యతను పదవీ విరమణ అనంతరం కూడా ప్రజల సంక్షేమం కోసం వినియోగించాలని సూచించారు. ఉద్యోగ విరమణతో సేవలు ముగిసిపోవని, అది జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది మాత్రమేనని, మిగిలిన జీవితాన్ని ప్రజాసేవకు, సమాజాభివృద్ధికి అంకితం చేస్తే మరింత సంతృప్తి లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మైత్రి మిణుగురులు కవిత ద్వారా
# శుభాకాంక్షలు తెలిపిన మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్



**మెదక్, ఆగస్టు 2(జనంసాక్షి):** స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్ హృదయాలను హత్తుకునే "మైత్రి మిణుగురులు" అనే కవిత ద్వారా స్నేహితులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. స్నేహం విలువను, ఆత్మీయతను, అనుబంధాన్ని, జీవితంలో స్నేహితుల ప్రాధాన్యతను తన కవితలో ఎంతో హృద్యంగా ఆవిష్కరించారు.
మైత్రి మిణుగురులు స్వయం ప్రకాశములా వెలిగి సమస్తము తానై నిలిచి స్వంతమై సహవాసం చేసి అంతమయ్యే వరకు అంతరంగమున ఉండేది స్నేహం... తల్లి వలే లాలించి తండ్రి వలె దండించి కరస్పర్శతో ధైర్యమును అందించే దైవాంశ సంభూతులు స్నేహితులు.. మౌన శృంఖలాలను తెంచి పలుకు పరిమళాలు పంచి మకిలి మరకలను చెరిపి గెలుపు గగనమును తాకించే మైత్రి మిణుగురులు నేస్తాలు.. వందనాలు దూరమైన హృదయాలు చేరువే మాటల అంపకాలు ఆగిపోయిన జ్ఞాపకాలు పదిలమే కలహాలు దరిచేరిన బంధాలను త్రుంచినా డెందమును వీడదు స్నేహబంధము.. ప్రాణ స్నేహితుని పలకరింపులో విరిసేను వాత్సల్య హసితాలు వినిపించేను మైత్రి సరాగాలు వికసించేను చెలిమి సుమాలు విలసిల్లును నెయ్యపు సీమలు భిన్నతత్వాలైనా వదలని సఖ్యము భిన్న లక్షణాలున్న వదులుకోని సాంగత్యం కనుక సద్గుణ స్నేహితుల హృదయమే స్వర్గధామము హితము తెలిపే స్నేహితులున్న ఇలయే స్వర్గము.. ఈ సందర్భంగా స్నేహితులందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్నేహబంధాలు శాశ్వతంగా చిరకాలం నిలవాలని మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్ ఆకాంక్షించారు.

# ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త ఆందోళన
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపు

**నంగునూరు, ఆగస్టు 2 (జనంసాక్షి):** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 10న నిర్వహించనున్న దేశవ్యాప్త 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం
నంగునూరు మండల కేంద్రంలో సీఐటీయూ అనుబంధాల సదస్సు అనంతరం జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ), అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) సంయుక్త పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.
కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను నోటిఫై చేసి, కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రోజువారీ పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచే ప్రతిపాదనలు, 'హైర్ అండ్ ఫైర్' విధానాలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలను బలహీనపరిచే చర్యలను తీవ్రంగా ఖండించారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.
విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా దేశీయ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని చెప్పారు. రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకు పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం రుణ విమోచన చట్టాన్ని తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను విరమించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి పాత విధానాన్నే కొనసాగించాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లు--2025ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్యుత్ పథకాలను రద్దు చేసే చర్యలను నిలిపివేయాలని కోరారు. ఆహార భద్రతా చట్టం కింద పేదలకు అందిస్తున్న నాణ్యమైన బియ్యంపై కోత విధించే ప్రయత్నాలను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.
దేశ స్వాతంత్ర్య సమరంలో కీలకమైన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలందరూ ఏకమై ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో ఉద్యమంలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల కనకయ్య, గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు రవీందర్, హమాలీ సంఘం నంగునూరు మండల అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు బాలరాజు, లక్ష్మణ్, సుధాకర్, అనిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి..



**పెద్ద శంకరంపేట, ఆగస్టు 2(జనంసాక్షి):** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని బూరుగు పల్లిలో ఆదివారం కోటమ్మ తల్లికి నిర్వహించిన ఆషాడమాస బోనాల ఉత్సవాలలో నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు ప్రజలు ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని వర్షాలు సమృద్ధిగా కృషి పంటలు బాగా పండాలని నియోజకవర్గ ప్రజలందరి పై కోటమ్మ తల్లి చల్లని చూపు ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామాలలో భక్తి భావం పెంపొందించడానికి ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

బూరుగుపల్లి గ్రామంలోని పురవీధుల గుండా మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని భాజా భజంత్రీలతో ఊరేగింపుగా కోటమ్మ తల్లి ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు. బూరుగుపల్లి సర్పంచ్ పెరుమాండ్లు గౌడ్. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారా గౌడ్. దాచ సంగమేశ్వర్. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో మనస్తాపం..

# ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య

**నారాయణఖేడ్: ఆగస్టు 02 (జనంసాక్షి):**



నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా కాలనీలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై నారాయణఖేడ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ మండలం చాప్టా-కె గ్రామానికి చెందిన కపిల సిద్ధలింగప్ప (38) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఐదేళ్ల క్రితం మంగళ్‌పేట్ గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మితో ప్రేమ వివాహం కాగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడు రోజుల క్రితం భాగ్యలక్ష్మి పిల్లలతో కలిసి తన పుట్టింటికి వెళ్లడంతో సిద్ధలింగప్ప ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి కపిల శరణప్ప (65) ఇచ్చిన ఫిర్యాదులో, కొంతకాలంగా సిద్ధలింగప్ప ఆరోగ్య సమస్యలతో, ముఖ్యంగా ఫిట్స్ (మూర్ఛ) వ్యాధితో తీవ్ర మనస్తాపానికి గురై ఉండేవాడని, అదే కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు నారాయణఖేడ్ పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## విశ్వ యజ్ఞం మహాయాగానికి బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు విరాళం

**వెల్దండ, ఆగస్టు 02 ( జనంసాక్షి):**



కల్వకుర్తి పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న 91వ విశ్వశాంతి కాలచక్ర మహాయజ్ఞానికి వెల్దండ బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోయయ్య ఆదివారం తన నివాసంలో విశ్వశాంతి మహా యజ్ఞ కమిటీ సభ్యులకు రూ. 25 వేల రూపాయలు విరాళం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రపంచ సుఖశాంతుల కోసం శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 91వ విశ్వశాంతి కోసం విరాళం అందించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా తన సహకరాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తల్లిని స్మరించి.. బోనం స్మరించి



**పాపన్నపేట, ఆగస్టు 2 (జనంసాక్షి):** తల్లిని స్మరిస్తూ బోనాల పండుగ సాగింది. ఆషాడ మాసం మూడవ ఆదివారం సందర్బంగా మండల కేంద్రం పాపన్నపేటలో నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మలకు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు వేడుక కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించి,ప్రత్యేక పూజల్లో పాల్గొని తల్లికి పలు మొక్కులు చెల్లించారు. భక్తితో తీర్చిదిద్దిన బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకొని గ్రామ పురవీధుల గుండా మర్రి చెట్టు సమీపం నుండి ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం సభ్యులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి రోడ్డుపై బురద తొలగింపు

**ఆత్మకూర్ ఆగస్టు 2 (జనంసాక్షి):** ఇటీవల కాలంలో కురిసిన వర్షంతో జూనియర్ కాలేజీ ప్రధాన రహదారి ముందర రోడ్డులో బురద ఎక్కువగా ఉండడంతో మున్సిపల్ చైర్ పర్సన్ జి నాగమణి ఆదేశానుసారం పోక్లింగ్‌తో బురదను తొలగించారు, ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దండు శ్రీను,వెంకట్ రాములు, నాయకులు అజ్మతుల్లా,బాల మన్యం, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు

### ప్రజాభిప్రాయానికి భిన్నంగా

# ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ విస్తరణకు అనుమతిస్తే ప్రజా ఉద్యమం

- నిధులను గ్రామ అభివృద్ధికి వెచ్చించని యాజమాన్యం
- కాలుష్యం వెదజలుతున్న ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమపై చర్య తీసుకోవాలి
- రంగయిపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య
- గ్రామాన్ని సందర్శించిన సిపిఎం ప్రతినిధి బృందం



**తూప్రాన్ ఆగస్టు 2(జనంసాక్షి):** మనోహరాబాద్ మండలం రంగయిపల్లి శివారు లో ఉన్న ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న గ్రామాన్ని ఈ రోజు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ మల్లేశం, ఏ మహేందర్ రెడ్డిలతో కూడిన ప్రతినిధి బృందం గ్రామాన్ని సందర్శించి, గ్రామ ప్రజలను కలసి పరిశ్రమ వలన ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది.

ఈ సందర్బంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య మాట్లాడుతూ 2006 నుండి పరిశ్రమలో ఉత్పత్తులు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికే 3 సార్లు పరిశ్రమను విస్తృత పరిచరని తెలిపారు. పరిశ్రమ నుండి వెలవడుతున్న కాలుష్యంతో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం అయ్యాయని వాటి వలన గ్రామంలోని ప్రజలకు చర్మ వ్యాదులు, శరీరంపై దద్దుర్లు వస్తున్నాయని అన్నారు. పరిశ్రమ వెదజల్లే దుమ్ము, దూళి వలన నల్లటి దుమ్ముతో ప్రజలు తీవ్ర అనారోగ్యనికి గురవుతున్నారని తెలిపారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వలన రద్దీ తీవ్రంగా ఉంటుందని, ప్రజలు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్న పరిశ్రమ యాజమాన్యం పట్టించుకోవడం లేదని అన్నారు. పరిశ్రమ ఉత్పత్తుల విస్తరణ కోసం ప్లాంట్ను ఎక్స్టెండ్ చేయాలనే ఆలోచనను యాజమాన్యం విరామించుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమవలన పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. 20 ఏండ్ల నుండి పరిశ్రమ నుండి వెలువడుతున్న కాలుష్యం వలన రైతుల పొలాల్లో పంటలు పండడం లేదని, పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారిందని అన్నారు. పరిశ్రమ నుండి బయటకు వస్తున్న కాలుష్య జలాలు పంట పొలాల్లోకి రావడం వలన వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు, కూలీల చేతులు, కాళ్ళపై దురదతో పాటు అనేక చర్మ వ్యాదులు వస్తున్నాయని అన్నారు. పరిశ్రమ నుండే వచ్చే నీళ్లు చెరువులు, కుంటాలలోకి వెళ్లడం వలన చేపలు చనిపోయి, మత్స్య కారులు నష్టపోతోతున్నారని అన్నారు. రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న పరిశ్రమపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పర్యావరణ కాలుష్యం వలన భవిష్యత్లో గ్రామంలో పుట్టబోయే పిల్లలు అంగవైక్యంతో పుట్టే ప్రమాదం ఉందని అన్నారు. పరిశ్రమలో ఇప్పటికే అనేక సార్లు ప్రమాదలు జరిగి అనేక మంది చనిపోయరని అన్నారు. పరిశ్రమలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అనే భయంతో రెండు గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కు మాంటున్నారని అన్నారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా పరిశ్రమను ఎక్స్టెండ్ చేసుకునే హక్కు పరిశ్రమ యాజమాన్యంకు ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రజా అభిప్రాయ సేకరకనాలో గ్రామ ప్రజలు వ్యతిరేకించరని, ప్రజల అభిప్రాయంకు అనుగుణంగా ప్రభుత్వం నడుచుకోవాలని అన్నారు. మీా అగర్వాల్ పరిశ్రమతో గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 10-15 రోజుల నుండి ప్రజలు ఆందోళన చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎందుకు స్పందించడం లేదని అన్నారు. పరిశ్రమ కాలుష్యంకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలు చేస్తున్న పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దత్తు ఇస్తుందని తెలిపారు. గ్రామాన్ని వెంటనే జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రజలతో మాట్లాడి ప్రజల అభిప్రాయన్ని ప్రభుత్వానికి తెలియచేయాలనీ డిమాండ్ చేశారు. పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని, దూరప్రాంతా ప్రజలకు ఉపాది కల్పించి స్థానికులకు మాత్రం కాలుష్యన్ని ఇస్తుందని అన్నారు. CSR నిధులను గ్రామ అభివృద్ధి కోసం ఎందుకు వెచ్చించడం లేదని ప్రశ్నించారు. కాలుష్యం వెదజల్లి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న మీా అగర్వాల్ పరిశ్రమపై చర్యలు తీసుకునే వరకు గ్రామ ప్రజలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హేచ్చరించారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించే వరకు దశాల వారీగా ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు.

## శ్రీ కృష్ణ కాలచక్ర మహాయజ్ఞానికి మార్కెట్ చైర్మన్ భారీ విరాళం

**వెల్దండ, ఆగస్టు 02 (జనంసాక్షి):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని టెలిఫోన్ గ్రౌండ్లో నిర్వ హిస్తున్న 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవానికి,శ్రీ కృష్ణ పీఠాధిపతి పరమపూజ్య శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి దివ్య మంగళాశాసనాలతో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగం సందర్భంగా కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ ఆదివారం శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీకి రూ. 2,50,000/- రెండు లక్షలయాభై వేల రూపా యల చెక్కును విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు మార్కె ట్ చైర్మన్ కు అభినందనందించి, దేవుని కృప వారి కుటుంబం పై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ సంజయ్ కుమార్‌కు ఆర్థిక సాయం అందించిన కాంగ్రెస్ నాయకుడు బద్దం నరసింహారెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్ (జనంసాక్షి) :** రెండు కిడ్నీలు పాడై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్ట్ సంజయ్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం నరసింహారెడ్డి మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం అందించారు. మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ సర్కిల్ 8వ డివిజన్ పోచారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో నివసిస్తున్న జర్నలిస్ట్ సంజయ్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా రెండు కిడ్నీలు విఫలమై చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోచారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బద్దం నరసింహారెడ్డి స్పందించి, ఆదివారం రోజున జర్నలిస్ట్ నివాసానికి వెళ్లారు. సంజయ్ కుమార్ పరామర్శించి, ఆయన వైద్య చికిత్స నిమిత్తం తనవంతు సాయంగా రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో ప్రజా సమస్యలను వెలికితీసే జర్నలిస్టులు అనారోగ్యానికి గురైనప్పుడు ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సంజయ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేష్ గౌడ్, మెట్టు నరసింహారెడ్డి, తిరుమల్ రెడ్డి, వంగాల లక్ష్మి మరియు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ దుర్గమ్మ అమ్మవారి బోనాల కార్యక్రమ ప్రత్యేక పూజలో కొలన్ హన్మంత్ రెడ్డి



**నిజాంపేట్ జూలై 2 (జనంసాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పరిధిలో శ్రీ శ్రీ శ్రీ దుర్గమ్మ బోనాల ఉత్సవాల ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి--సమృద్ధులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, మైసిగారి శ్రీనివాస్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రేమ్ కుమార్ పటేల్, అకోటే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి

### ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్



**శంషాబాద్,ఆగస్టు2(జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, సుఖసంతోషాలతో జరుపుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఆకాంక్షించారు. బోనాల పండుగ సందర్భంగా శంషాబాద్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభిమానులు, స్థానిక నాయకుల ఆహ్వానం మేరకు ఆయా దేవాలయాలను సందర్శించిన ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి కరువు కాటకాలు తొలగిపోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, దేవాలయ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ట్రినిటీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, పద్మస్ ట్రినిటీ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### 163 మందికి ఆరోగ్య పరీక్షలు.. ఉచిత వైద్య సేవలు అందించిన నిపుణుల బృందం




**కీసర (జనంసాక్షి) :** దమ్మాయిగూడలోని పద్మశాలి టౌన్‌షిప్‌లోని ట్రినిటీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, పద్మస్ ట్రినిటీ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో సుమారు 163 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకుని లబ్ధి పొందారు. శిబిరంలో భాగంగా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, దంత, పల్స్, ఎస్‌పీఓ2 పరీక్షలతో పాటు బరువు కొలతలు ఉచితంగా నిర్వహించారు. అలాగే జనరల్ ఫిజీషియన్ సేవలు అందించి, ఆరోగ్య సమస్యలపై వైద్యులు సూచనలు




చేశారు. డాక్టర్ ఎస్.డి.ఎస్.రాజు, డాక్టర్ ప్రగతి నేతృత్వంలోని వైద్య బృందం ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు, చికిత్స అందించింది. ట్రినిటీ హాస్పిటల్ యాజమాన్య బృంద సభ్యులు అమృత్ రాజ్, ఎలిజబెత్, క్యాంప్ మేనేజర్ కార్తిక్ పర్యవేక్షణలో కార్యక్రమం సజావుగా సాగింది. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ట్రినిటీ హాస్పిటల్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ ప్రతినిధులు వెల్లడించారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పనులు

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా, కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగితంమన్మోహన్ గౌడ్



**మోమిన్‌పేట ఆగస్టు 2,( జనం సాక్షి) :** సర్పంచ్ ఎన్నికల్లో టేకులపల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన సుద్దోడ్డతాండ, లో ఇచ్చిన హామీ మేరకు ఫార్మేషన్ రోడ్డు పనులను సొంత నిధులతో టేకులపల్లి గ్రామము నుండి సుద్దోడ్డా తాండకు వెళ్లే దారి లో అర కిలోమీటర్ రోడ్డు పనులనుఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగితం మన్మోహన్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి సుద్దోడ్డా తాండా ప్రజలు, రైతులు, విద్యార్థులు అనేక వ్యయ ప్రయాసలకు గురవుతూ టేకులపల్లి గ్రామానికి ప్రతినిత్యంవస్తుండేవారు. కొన్ని సందర్భాల్లో అనారోగ్యానికి గురైన వ్యక్తి మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయని ,ఇలాంటి సంఘటనలు తమ దృష్టికి రాగా తమ హృదయము చలించి ఎట్టి పరిస్థితుల్లో తాండ ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు రోడ్డు సౌకర్యము కల్పిస్తానని తాండవాసులకు ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకున్నారు. రోడ్డు వేసేందుకు దళిత పట్టదారులకు, ప్రత్యామ్నాయంగా దళిత రైతులకు రాజు, చంద్రయ్య, నాగేష్, దప్పు మల్లేష్,లకు మిగతావారికి భూమి ఇప్పిస్తామని తెలంగాణ రాష్ట్ర శాసనసభాధి పతి,గడ్డం ప్రసాద్ కుమార్ తో ప్రత్యేకంగా దళిత రైతులతో మాట్లాడించి వారికి ప్రత్యామ్నాయంగా భూమి ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో, మోమిన్ పేట తాహసిల్దార్ మునీరుద్దీన్ తో స్పీకర్ మాట్లాడగా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని తాహసిల్దార్ అన్నారు. దీంతో దళిత రైతులు సంతోషించి పట్టా భూమి ని రోడ్డుకు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో మన్మోహన్ గౌడ్ ముందుకు వచ్చి తాండావాసుల ప్రజల చిరకాల వాంఛ నెర వేర్చారు. దీని ద్వారా తండావాస ప్రజలు టేకులపల్లి గ్రామానికి రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా మార్గం సుగమం,అయిందని తాండ ప్రజలు, బివిద్యార్థులు మహిళలు పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు., ఓటమిని అంగీకరించి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని తూచ తప్పకుండా నెరవేర్చాడు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అండదండలతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులు ప్రారంభించారు. ప్రతినిత్యం టేకులపల్లి గ్రామానికి సుమారు 50 మంది విద్యార్థులు పాఠశాలకు, రేషన్ బియ్యం కోసం, టేకులపల్లి గ్రామానికి ప్రతినిత్యం వస్తుంటారు, అలాగే అర్హులైన లబ్ధిదారులందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయిస్తానని, ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించేందుకు కృషి చేస్తానని మన్మోహన్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మన్నే వెంకటేశం యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, నరేందర్ గౌడ్, పాండు, ఫయాజ్, సద్దాం, ఫిరోజ్, సీనియర్ నాయకులు కొండాపురం మహబూబ్అలీ,ఎగ్బాల్ జలీల్ ,ఆర్ శ్రీనివాస్, బి అశోక్, టి ప్రభూఫ్, బాబు నాయక్, దీప్లా నాయక్, ప్రశాంత్, బబ్లు, రామావత్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు పార్టీ నాయకులు కార్యకర్తలు, నాయకులు తదితరులు